క్లుప్తంగా

అవగాహనతోనే హెచ్ఐవీ నివారణ



సంచార వాహనాన్ని ప్రారంభిస్తున్న డీఎంహెచ్ఓ డాక్టర్ నాగరాజు

కడప రూరల్ : లైంగిక అంశాలపై తగు జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా ఎయిడ్స్ వ్యాధికి కారణమైన హెచ్ఐవీ నుంచి తప్పించుకోవచ్చని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ నాగరాజు తెలిపారు. శనివారం స్థానిక జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం ప్రాంగణంలో సంచార వాహనం ద్వారా హెచ్ఐవీ/ఎయిడ్స్, మాదక ద్రవ్యాల వినియోగంపై అవగాహన కార్యక్రమాన్ని ప్రారంభించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో సంచార వాహనం ద్వారా అవగాహన కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. ఎయిడ్స్‌ను పూర్తిగా నిర్మూలించడం మన చేతుల్లోనే ఉందన్నారు. సురక్షితమైన లైంగిక జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా ఎయిడ్స్ బారిన పడకుండా ఉంటామన్నారు. ఎయిడ్స్‌కు ఇప్పటికీ సరైన మందు లేదని, నివారణ ఒక్కటే మార్గమని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ ఉమామహేశ్వర్, రవిబాబు, భారతి, మనోరమ, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

వైద్య విద్యపై ప్రభుత్వం కుట్రలు



వైఎస్సార్ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

కడప వైఎస్ఆర్ సర్కిల్: విద్య వైద్యం పేద, మధ్య తరగతి విద్యార్థులకు దూరం చేయాలని కూటమి ప్రభుత్వం కుట్ర పన్నుతోందని, మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ తగదని కాంగ్రెస్ పార్టీ జిల్లా జనరల్ సెక్రటరీ సయ్యద్ గౌస్ పీర్ పేర్కొన్నారు. శనివారం ఇంటింటికి కాంగ్రెస్ కార్యక్రమంలో భాగంగా నగరంలోని 5వ డివిజన్ అశోక్ నగర్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ ప్రైవేటీకరణతో దేశ ప్రగతి ముందుకు సాగదని ఈ నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని కోరారు. ప్రైవేటీకరణ వలన వైద్య విద్య అందని ద్రాక్షలా ఉంటుందని వివరించారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో 5వ డివిజన్ ఇన్‌చార్జి ఫజలుల్లా, జిల్లా ఉపాధ్యక్షుడు సిరాజుద్దీన్, దాసరి శ్రీనివాసులు, శివ, బీవీ అంజన్‌కుమార్, యూసుఫ్, జాబీర్, మస్తాన్, రెడ్డయ్య, అబ్దుల్ రౌఫ్ పాల్గొన్నారు.

'బ్రౌన్' పనుల పర్యవేక్షణ కమిటీ ఏర్పాటు

కడప సెవెన్‌రోడ్స్ : కడప నగరంలోని సీపీ బ్రౌన్ గ్రంథాలయ విస్తరణ పనుల పురోగతి, నాణ్యతా ప్రమాణాల పర్యవేక్షణ కోసం ఒక కమిటీని ఏర్పాటు చేస్తూ యోగి వేమన విశ్వవిద్యాలయ ఇన్‌చార్జి వైస్ చాన్సలర్ అల్లం శ్రీనివాసరావు ప్రొసీడింగ్స్ జారీ చేశారు. సీపీ బ్రౌన్ స్మారక లైబ్రరీ విస్తరణ కోసం యోగి వేమన విశ్వవిద్యాలయం, ఏపీఈడబ్ల్యూఐడీసీ మధ్య ఎంఓయూ కుదిరింది. దీంతో పనుల పురోగతి, నాణ్యతను పరిశీలించేందుకు కమిటీని ఏర్పాటు చేశారు. వైవీయూ చీఫ్ ఇంజనీర్ అధ్యక్షతన ఏర్పడిన ఈ కమిటీలో సీపీ బ్రౌన్ మెమోరియల్ డైరెక్టర్, ప్రొద్దుటూరు వైఎస్సార్ ఇంజనీరింగ్ కళాశాల ఈసీఈ విభాగం ప్రొఫెసర్ కె.వెంకట రమణయ్య, వైవీయూ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు, వైవీయూ విద్యుత్ విభాగ అసిస్టెంట్ ఇంజనీరు టి.దస్తగిరి, సీపీ బ్రౌన్ మెమోరియల్ లైబ్రరీ సలహా సంఘ సభ్యులు జానమద్ది విజయభాస్కర్, సీపీ బ్రౌన్ లైబ్రరీ జూనియర్ రీసెర్చి అసిస్టెంట్ సి.శివారెడ్డి సభ్యులుగా, వైవీయూ రిజిస్ట్రార్ కన్వీనర్‌గా ఈ కమిటీలో వ్యవహరిస్తారు.

జోస్ అలుక్కాస్ సేవలు స్ఫూర్తిదాయకం



ఎస్పీ చేతుల మీదుగా చెక్కును ఇస్తున్న జోస్ అలుక్కాస్ ప్రతినిధులు, సిబ్బంది

కడప కోటిరెడ్డిసర్కిల్ : ప్రముఖ బంగారు, వజ్రాభరణాల విక్రయ సంస్థ జోస్ అలుక్కాస్ షోరూం మొదటి వార్షికోత్సవ వేడుకల నేపథ్యంలో నిర్వహిస్తున్న సామాజిక సేవలు స్ఫూర్తిదాయకమని జిల్లా ఎస్పీ ఈజీ అశోక్‌కుమార్ తెలిపారు. శనివారం కడపలో జోస్ అలుక్కాస్ షోరూంలో ఏర్పాటు చేసిన మొదటి వార్షికోత్సవ వేడుకల్లో ఎస్పీ పాల్గొని మాట్లాడారు. సంస్థ వ్యాపార కార్యకలాపాలతోపాటు వివిధ సామాజిక సేవల విషయంగా ముందుందని, ఈ క్రమంలో కడప నగరం గాంధీనగర్ మున్సిపల్ హైస్కూలులో రూ. 2.50 లక్షల విలువైన డైనింగ్ సామగ్రి ఏర్పాటుకు నగదును అందజేయడాన్ని అభినందిస్తున్నామన్నారు. షోరూం మేనేజర్ గణేష్, అసిస్టెంట్ మేనేజర్ సినోజ్ పీఆర్ఓ. శరత్ పవన్‌తోపాటు సిబ్బంది పాల్గొన్నారు.

సంస్కృతుల వారధి.. సమైక్య సారథి

- దేశంలో హిందీబాషకు ఎంతో ప్రాధాన్యం
- జాతీయ బాషగా హిందీకి గుర్తింపు
- నేడు జాతీయ హిందీ బాషాదినోత్సవం



కడప ఎడ్యుకేషన్: భారతదేశ వివిధ సంస్కృతులు, విభిన్న బాషలు, నాగరికతలకు నెలవు. ఒకరి అభిప్రాయాలు ఒకరు తెలుసుకునేందుకు, మాట్లాడేందుకు బాష ఎంతో అవసరం. ప్రతి రాష్ట్రానికి ప్రాంతీయ బాష ఉంటుంది. ప్రపంచంలో పలు బాషలను దేశ ప్రజలు మాట్లాడుతుండగా.. వాటిలో అధికారికంగా 24 బాషలను గుర్తించినప్పటికి దేశ జనాభాలో 55 శాతం మంది హిందీ మాట్లాడే, అర్థం చేసుకునే వారున్నారని హిందీబాషను జాతీయ బాషగా హిందీని గుర్తించారు. 1949లో భారత రాజ్యాంగ సభ హిందీని జాతీయ అధికారిక బాషగా గుర్తించింది. అప్పటి నుంచి ఏటా సెప్టెంబర్ 14వ తేదీని హిందీ దివస్ (బాషా దినోత్సవం)గా జరుపుకుంటున్నారు. భారతదేశం విభిన్న మతాల, ప్రాంతాల, భాషల నిలయం. హిందీ భారతీయులను భిన్నత్వంలో ఏకత్వాన్ని ప్రబోధిస్తుంది. ఎందుకుంటే భారతీయుల్లో అధిక శాతం మంది హిందీబాషను అర్థం చేసుకుంటున్నారు. స్వాతంత్రం వచ్చిన తర్వాత హిందీబాషకు రాజబాషా హోదాను మన నాయకులు ఇచ్చారు. భారతదేశానికి స్వాతంత్ర్యం రాక ముందు భారతీయులందరిలో జాతీయ స్ఫూర్తిని నింపడానికి హిందీబాష ఎంతో దోహద పడింది.

మహాత్ముడి కృషి

అందులకు ఆద్యుడు మహాత్మాగాంధీ అని చెప్పుకోవాలి. అందునా తమ జీవితం మొత్తం హిందీబాష ప్రచారానికి కృషి చేశారు. భారతదేశంలో వివిధ బాషలు మాట్లాడే ప్రజల మధ్య ఐక్యత పెపొందించడానికి జాతీయ స్ఫూర్తి నెలకొల్పడానికి హిందీబాషా ఒక్కరే మార్గం అని ఆయన భావించారన్నారు. మహాత్మాగాంధీ గుజరాతీ అయినప్పటికి 1918 మార్చిలో మద్రాసు మహానగరంలో ఒక సభలో మాట్లాడుతూ భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత రాజబాషగా హిందీకి గౌరవం దక్కపోతుందని ప్రకటించారు. ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 14వ తేదీన హిందీ దినోత్సవం పేరును దేశ వ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వ కార్యాలయాలలో అధికారికంగా ప్రభుత్వ వేడుకలు నిర్వహిస్తుంది. హిందీబాష ప్రచారానికి, వికాశానికి ఆహర్నిశలు కృషి చేసిన కవులను, సాహిత్య కారులను, బాషా సేవకులను పలు పురస్కారాలలోపాటు నగదు బహుమతులతో పోత్సహిస్తుంది.

వారసత్వ సందప



హిందీబాష భారతీయులందరికి వారసత్వ సంపదలాంటిది, స్వాతంత్ర్య ఉద్యమకాలం నుంచి ఈ బాషకు ప్రాముఖ్యత ఉంది. ఈ బాషాభివృద్ధికి విద్యార్థి దశ నుంచే ప్రాత్సహం అందించాలి. బాషపై ఏకాగ్రత ఉంచితే సులభంగా నేర్చుకోవచ్చు.

– కెఎస్. పర్వతుల్లా, హిందీబాష పండిట్, జెడ్పీ హైస్కూల్, ఆలంఖాన్‌పలి

మధ్యంతర భృతి ప్రకటించాలి



ఎమ్మెల్సీకి వినతిపత్రం ఇస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

కడప ఎడ్యుకేషన్: ఉద్యోగ, ఉపాధ్యాయులకు మధ్యంతర భృతిని ప్రకటించాలని నోబుల్ టీచర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఏబీ రామకృష్ణమరాజు డిమాండ్ చేశారు. ఈ విషయమై శనివారం ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డిని పులివెందుల్లో కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 11వ వేతన సవరణ గడువు జూలై 2023తో ముగిసిందని చెప్పారు. దీంతో 12వ వేతన సవరణ కమిషన్‌ను నియమించాలని కోరారు.

ప్రభుత్వంపై ఉద్యోగ ఉపాధ్యాయులు ఎంతో ఆశతో ఉన్నారని, మధ్యంతర భృతి 30 శాతం తగ్గకుండా దసరా కానుకగా ప్రకటించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గౌరవాధ్యక్షుడు కూరాకు రవీంద్ర, రాష్ట్ర కౌన్సిలర్ అబ్దుల్ గఫూర్, నాయకులు లక్ష్మీనారాయణ, రాజశేఖర్ రెడ్డి, మనోహర్ రెడ్డి, శివనారాయణ రెడ్డి, విజయవర్ధన్ రెడ్డి పాల్గొన్నారు.

నిధులు చెల్లించాలి

ఉద్యోగ, ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన బకాయిలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చెల్లించాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఖాదర్‌బాషా కోరారు. ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర సంఘం పిలుపు మేరకు శనివారం ప్రజా ప్రతినిధులకు వినతిపత్రం సమర్పించే కార్యక్రమములో భాగంగా ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామగోపాలురెడ్డి పులివెందుల్లో కలిసి వినతిపత్రం సమర్పించిచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఇవ్వవలసిన డీఏ, ఐఆర్, పీఆర్‌సీ బకాయిలను చెల్లించాలన్నారు. దీంతోపాటు వేతన సవరణ కమీషన్‌ను నియమించాలని కోరారు. మాజీ జిల్లా అధ్యక్షులు జి. గురవయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు నరసింహులు, నారాయణ, శ్రీనివాసులు, చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మనసుకవి ఆచార్య ఆత్రేయ



ఆత్రేయ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న మూల మల్లికార్జునరెడ్డి తదితరులు

కడప ఎడ్యుకేషన్: సినిమాల్లో మనసుకు సంబంధించిన పాటలు ఎక్కువగా రాసి, మానవ జీవిత తత్వాన్ని గుట్టు విప్పిన ఆత్రేయ మనసు కవిగా ప్రసిద్ధులయ్యారని వైఎస్సార్ కడప జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు ఆచార్య మూల మల్లికార్జున రెడ్డి కొనియాడారు. వైఎస్సార్ కడప జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో శనివారం కడప రాజీవ్ కల్చరల్ క్లబ్ కార్యాలయంలో ఆచార్య ఆత్రేయ 36వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. మొదట ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆనంతరం ఆయన మాట్లాడుతూ ఆత్రేయ సినిమా రంగంలో ప్రవేశించి దర్శకుడిగా, నిర్మాతగా ,పాటలు, సంభాషణల రచయితగా గొప్ప కీర్తి ప్రతిష్టలు సంపాదించుకున్నారని ప్రశంసించారు. ఆయన సినిమా ప్రేక్షకుల్ని కంటతడి పెట్టించి వారి గుండెల్లో పదిలమైన స్థానం సంపాదించారన్నారు. దాసరి సుధాకర్ మాట్లాడుతూ ఆత్రేయ పాటలు రాసిన మంచి మనసులు, డాక్టర్ చక్రవర్తి, బడిపంతులు, మూగమనసులు, ప్రేమనగర్, స్వాతిముత్యం, అంతులేని కథ, మరోచరిత్ర మొదలైన గొప్ప చిత్రాలు ఆయన పాటలతోనే విజయం సాధించాయని చెప్పడంలో అతిశయోక్తి లేదన్నారు. ఎం సత్యనారాయణ ప్రసంగిస్తూ ఆత్రేయ రాసిన వందలాది పాటలు ప్రేక్షక హృదయాన్ని పరవశంతో ఓలలాడించాయన్నారు. ఏ శ్రీనివాసరాజు మాట్లాడుతూ ఆత్రేయ జీవితాన్ని కాచి వడపోసిన నగ్నసత్యాలు చెప్పారని, అవి ప్రతి వ్యక్తికి మార్గదర్శకాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాకారులు రామనపల్లి శంకర్, వీరదాసరి ప్రకాష్, యడవల్లి రామలింగయ్య, మందల చిన్నయ్య, గడికోట రెడ్డయ్య, మందల మురళి, ఎం వెంకటసుబ్బయ్య, ఎన్ రామ సుబ్బారెడ్డి, బి బాల ఓబయ్య, ఎస్ వీరయ్య పాల్గొన్నారు.

కార్పొరేట్ శక్తులకు కేంద్రం ఊడిగం



మాట్లాడుతున్న దేవారాజన్

కడప ఎడ్యుకేషన్: కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేస్తూ, పేదలను విస్మరిస్తోందని అఖిల భారత ఫార్వర్డ్ బ్లాక్ జాతీయ ప్రధాన కార్యదర్శి దెవరాజన్ అన్నారు. శనివారం కడప నగరంలోని వైఎస్సార్ ఆడిటోరియంలో అఖిల భారత విద్యార్థి బ్లాక్ (ఏఐఎస్‌బీ) 9వ జాతీయ మహాసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం పేద బడుగు బలహీన వర్గాల విద్యార్థులను ప్రభుత్వ విద్యకు దూరం చేసే విధంగా కార్పొరేట్ విద్యారంగాన్ని పెంచి పోషిస్తుందన్నారు. నరేంద్ర మోదీ పేద ప్రజల కోసం పనిచేయడం లేదని కేవలం అంబానీ, అదాని వంటి కార్పొరేట్ సంస్థల కోసమే పని చేస్తున్నారని ధ్వజమెత్తారు. అధికారంలోకి రాక ముందు ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి అధికారంలోకి రాగానే ఉన్న ఉద్యోగాలనే ఊడగొట్టే విధంగా బ్యాంకింగ్, రైల్వే, ఎల్ఐసీ వంటి ప్రభుత్వ సంస్థలను ప్రైవేట్ పరం చేస్తున్నారని దుయ్యబట్టారు. విభజన హామీలను భాగంగా రాష్ట్రానికి ప్రత్యేక హోదా, వెనుకబడిన ప్రాంతాలకు ప్రత్యేక ప్యాకేజీ, కడప జిల్లాలో ప్రభుత్వ రంగంలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేస్తామని డిమాండ్ చేశారు. దేశంలో నిరుద్యోగుల సంఖ్య పెరుగుతుందని, ఉపాధి అవకాశాలు కల్పించడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్‌బీ నాయకలు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించాలి



మాట్లాడుతున్న జాతీయ అధ్యక్షుడు మహమ్మద్ షఫివుల్లా

కడప ఎడ్యుకేషన్: పెండింగ్ స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని ప్రగతిశీల విద్యార్థి సంఘం జాతీయ అధ్యక్షుడు షఫివుల్లా డిమాండ్ చేశారు. శనివారం కడపలో పీఎస్‌యూ రాష్ట్ర కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో షఫీవుల్లా ఆర్ఎస్పీ పార్టీ రాష్ట్ర కార్యదర్శి జానకిరాములు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా డిగ్రీ, బీఈడీ, ఎంబీఏ, ఎంసీఏ ఇంజనీరింగ్ విద్యార్థులకు నాలుగు సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న రూ. 6,400 కోట్ల రూపాయలు ఫీజు రియంబర్స్‌మెంట్‌ను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. విద్యా సంవత్సరం పూర్తి చేసుకున్న విద్యార్థులు లక్షలాది మంది విద్యార్థుల ఒరిజినల్ సర్టిఫికెట్లు కాలేజీలలోనే ఉన్నాయని తెలిపారు ఫీజులు కడితేనే సర్టిఫికెట్లు ఇస్తామని విద్యాసంస్థలు యాజమాన్యం ఒత్తిడి తెస్తున్నారని పేర్కొన్నారు. విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో ఫీజులు సాధన కోసం ఉద్యమించాలని పిలుపునిచ్చారు. పీఎస్‌యూ రాష్ట్ర కార్యదర్శి సుబ్బరాయుడు మాట్లాడుతూ పెరిగిన ధరలకు అనుగుణంగా హాస్టల్ విద్యార్థులకు మెస్ చార్జీలను రూ. 2,500 పెంచి ప్రతి నెల విడుదల చేయాలన్నారు. అలాగే అద్దె భవనాల్లో నడుపుతున్న హాస్టళ్లకు సొంత భవనాలను నిర్మించాలని కోరారు. భవిష్యత్‌లో విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం పీఎస్‌యూ ఆధ్వర్యంలో ఉద్యమాలు చేస్తామని తెలిపారు. విద్య వైద్యం పేద, మధ్య తరగతి విద్యార్థులకు దూరం చేయాలని కూటమి ప్రభుత్వం కుట్ర పన్నుతోందని, మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ తగదన్నారు. పీఎస్‌యూ రాష్ట్ర కమిటీ సభ్యులు గోపి, సురేష్, అయ్యన్న, సురేంద్ర, సుధీర్, శివ, సాయి పాల్గొన్నారు.

పని ఒత్తిడి పెంచడం తగదు



మాట్లాడుతున్న కేసీ బాదుల్లా

కడప వైఎస్ఆర్ సర్కిల్: ప్రతి ఆర్పీ 100 పీఎం సూర్యఘర్ సోలార్ విద్యుత్ కనెక్షన్లకు తప్పనిసరిగా దరఖాస్తులు చేయించాలని మెప్మా అధికారులు ఒత్తిడి చేయడం తగదని జిల్లా ఆర్పీల అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు కేసీ బాదుల్లా కోరారు. శనివారం నగరంలోని హోచిమిన్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సోలార్ విద్యుత్ కనెక్షన్లపై రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాలను మెప్మా అధికారులకు బహిర్గతం చేయాలన్నారు. ఇప్పటికే స్వయం సంఘాల్లోని మహిళలకు ఆన్‌లైన్ బుకింగ్ పేరిట పసుపు కారంపొడి తదితర వస్తువులు ఆన్‌లైన్‌లో ఆర్పీలు సూచన మేర బుకింగ్ చేసిన సమయానికి రాలేదని డ్వాక్రా గ్రూపుల నుంచి ఆర్పీలు చివాట్లు తింటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పట్టణ ప్రగతి, స్వచ్ఛ సర్వేక్షన్, అనాథ పిల్లల సర్వే, అనేక ప్రభుత్వ కార్యక్రమాల్లో ఆర్పీలు పని చేస్తున్నప్పటికీ వారికి తగిన వేతనాలు అందడం లేదన్నారు. మహిళలు సామాజికంగా, ఆర్థికంగా ఎదిగేందుకు ఆర్పీలు నిత్యం అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని తెలిపారు. ఈ సమావేశంలో ఏఐటీయూసీ నగర అధ్యక్షుడు పి. సుబ్బరాయుడు, సునీల్ పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంలో రజకులకు రక్షణ లేదు



ఎం. గురుప్రసాద్

కడప కార్పొరేషన్: కూటమి ప్రభుత్వంలో రజకులకు రక్షణ లేకుండా పోతోందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగం సంయుక్త కార్యదర్శి ముడమాల గురుప్రసాద్ అన్నారు. శనివారం ఆయన ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు. ప్రశ్నించే హక్కును వినియోగించుకున్న ప్రతిసారీ రజకులను లక్ష్యంగా చేసుకోవడం దారుణమన్నారు. రాష్ట్రంలో ప్రజాస్వామ్యానికి, రాజ్యాంగ హక్కులకు పెద్ద ముప్పు ఏర్పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. క్రిష్ణా జిల్లా తాళ్లపాలెం పంచాయితీ, హెచ్ సత్తెన పాలెంలో రజక కులానికి చెందిన ఆర్ఎంపీ డాక్టర్ గిరిధర్ కుమార్‌పై జరిగిన దాడి దురదృష్టకరమన్నారు. కూటమి ప్రభుత్వం రజకులకు ఇచ్చిన హామీలను అమలు చేయకపోగా, ప్రశ్నించే వారిపై దాడులు చేయడం అత్యంత దారుణమని పేర్కొన్నారు. నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

కడప రిమ్స్ అభివృద్ధికి కృషి చేయాలి



కడప అర్బన్: మాట్లాడుతున్న వైస్ చాన్స్‌లర్ డాక్టర్ పి. చంద్రశేఖర్



కడప కోటిరెడ్డిసర్కిల్ : కార్యక్రమంలో పాల్గొన్న అధ్యాపకులు, విద్యార్థులు

డాక్టర్ ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ వీసీ డాక్టర్ పి. చంద్రశేఖర్

కడప అర్బన్: ప్రభుత్వ సర్వజన వైద్య కళాశాల (రిమ్స్) అభివృద్ధికి ప్రతి ఒక్క అధికారి కృషి చేయాలని డాక్టర్ ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ డాక్టర్ పి. చంద్రశేఖర్ అధికారులకు దిశా నిర్దేశం చేశారు. శనివారం ఆయన కడప రిమ్స్‌ను సందర్శించారు. అన్ని విభాగాల హెచ్ఓడీలతో సమావేశమయ్యారు. రిమ్స్ వైద్య కళాశాల చాలా విస్తీర్ణంగా ఉందని, ఆవరణాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు కృషి జరగాలని తెలియజేశారు. వైద్య కళాశాల గెస్ట్ హౌస్, కాలేజీ క్యాంటీన్, కళాశాల ఆడిటోరియం, ప్లే గ్రౌండ్‌ను త్వరలో ఏర్పాటు చేయాలని సూచించారు. అనంతరం పీజీ, యూజీ వైద్య విద్యార్థులతో సమావేశం నిర్వహించారు. వైద్య విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రికార్డులను పరిశీలించారు. ఏపీ ఎంఎస్ఐడీసీ అధికారులను పిలిపించి ఆడిటోరియం పనులు త్వరగా జరపాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కడప ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జమున, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వరరావు, వైస్ ప్రిన్సిపాల్ విజయభాస్కర్ రెడ్డి, హెచ్ఓడీలు, వైద్యులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన చికిత్స కోసం..

రాష్ట్రస్థాయిలో అన్ని మెడికల్ కళాశాలల వైద్య విద్యార్థులకు, రోగులకు మెరుగైన పరిశోధనలోనూ, వైద్య సేవలను అందించడంలోనూ ఏపీ ఏపీ కాన్ -2025 ఎంతో ఉపయోగపడుతుందని డాక్టర్ ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ వైస్ ఛాన్స్‌లర్ డాక్టర్ పి. చంద్రశేఖర్ అభిప్రాయపడ్డారు. ఆంధ్రప్రదేశ్ అసోసియేషన్ ఆఫ్ ఫిజిషియన్ ఇండియా ఏపీ చాప్టర్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 53వ కాన్ఫరెన్స్‌లో వీసీ మాట్లాడుతూ ప్రతి ఏడాది పీజీ వైద్య విద్యార్థుల కోసం, అసిస్టెంట్, అసోసియేట్ ప్రొఫెసర్ల పరిశోధనల కోసం లక్షలాది రూపాయలను ప్రభుత్వం ఖర్చు చేస్తుందన్నారు. జనరల్ మెడిసిన్, ఫిజిషియన్ విభాగంలో అనేక పరిశోధనలను చేసి ఎంతో మెరుగైన వైద్య సేవలను అందించిన తిరుపతికి చెందిన డాక్టర్ అల్లాడు మోహన్ లైఫ్‌టైం అచీవ్‌మెంట్ అవార్డును అందుకోవడం ఎంతో సంతోషించదగ్గ విషయమన్నారు. ఈ కాన్ఫరెన్స్‌లో ఏపీ ఏపికాన్-2025 ఏపి చాప్టర్ చైర్మన్‌గా వ్యవహరిస్తున్న డాక్టర్ మనోజ్‌కుమార్, డాక్టర్ మునీశ్వర్ రెడ్డితో పాటు, కడపలో రిమ్స్ వైద్యులలో ఆర్గనైజింగ్ కమిటీ చైర్మన్‌గా వ్యవహరిస్తున్న జనరల్ మెడిసిన్ హెచ్ఓడి డాక్టర్ యాదవేంద్రారెడ్డి, ఆర్గనైజింగ్ కమిటీ సెక్రటరీగా డాక్టర్ అవ్వారు అర్జున్‌కుమార్, కడప రిమ్స్ సూపరింటెండెంట్ డాక్టర్ కెఎస్ఎస్ వెంకటేశ్వరరావు కాన్ఫరెన్స్ అబ్జర్వర్‌గా డాక్టర్ వినయ్ వ్యవహరించారు.

'ఫాతిమా'లో ఎన్టీఆర్ హెల్త్ వర్సిటీ వీసీ

కడప కోటిరెడ్డిసర్కిల్ : డాక్టర్ ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ చంద్రశేఖర్ శనివారం కడప నగర పరిధిలోని ఫాతిమా మెడికల్ కళాశాలను సందర్శించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శైలారేఖ, సూపరింటెండెంట్ డాక్ట్ నగేష్ బాబు, అన్ని విభాగాల అధిపతులు, వైద్యులు, వైద్య విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్య వృత్తిలో నైపుణ్యాన్ని ఎలా పెపొందించుకోవాలో వివరిస్తూ దిశా నిర్దేశం చేశారు. విద్యార్థులు కష్టపడి చదివి మంచి వైద్యుడిగా సమాజానికి తమవంతుగా సేవలు అందించాలన్నారు. కళాశాల కరస్పాండెంట్ జవ్వాద్ మాట్లాడుతూ తమ కళాశాలను సందర్శించిన వీసీకి కృతజ్ఞతలు తెలిపారు. కర్నూలు మెడికల్ కళావాల ప్రిన్సిపాల్‌గా విశేష సేవలు అందించి కార్డియాలజీ విభాగాన్ని స్థాపించిన మేధావి అని కొనియాడారు. అనంతరం వీసీని కళాశాల ప్రతినిధులు ఘనంగా సత్కరించారు.

సమావేశాన్ని జయప్రదం చేయండి



సమావేశంలో చర్చిస్తున్న వైఎస్సార్‌సీపీ ఎస్సీ విభాగం నాయకులు

కడప కార్పొరేషన్: వైఎస్సార్‌సీపీ ఎస్సీ విభాగం జిల్లా విస్తృత స్థాయి సమావేశాన్ని జయప్రదం చేయాలని ఎస్సీ విభాగం జిల్లా అధ్యక్షుడు సింగమాల వెంకటేశ్వర్లు కోరారు. శనివారం జిల్లా పార్టీ కార్యాలయంలో సింగమాల వెంకటేశ్వర్లు అధ్యక్షతన సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఈనెల 20వ తేది పాత రిమ్స్‌లోని బీసీ భవన్‌లో ఈ విస్తృత స్థాయి సమావేశం నిర్వహిస్తున్నామని, ఈ సమావేశానికి కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, జిల్లా అధ్యక్షులు పి. రవీంద్రనాథ్‌రెడ్డి, రాష్ట్ర ఎస్సీ విభాగం అధ్యక్షులు టీజే ఆర్ సుధాకర్ బాబు, జిల్లాలోని ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు హాజరవుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బూసిపాటి కిశోర్, కార్పొరేటర్లు కె. బాబు, చెన్నయ్య, నాయకులు పులి సునీల్ కుమార్, సీహెచ్ వినోద్ కుమార్, బండి ప్రసాద్, మేసా ప్రసాద్, త్యాగరాజు, జాషువా, యోబు, శరత్‌బాబు, పి. సంపత్ కుమార్, కంచుపాటి బాబు, శ్రీనివాసులు పాల్గొన్నారు.

ప్రైవేటు పాఠశాలల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న విద్యార్థి సంఘ నాయకులు

కడప ఎడ్యుకేషన్ : సెలవుల్లో తరగతులు నిర్వహించే విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని అఖిల భారత విద్యార్థిసంఘం రాష్ట్ర అధ్యక్షుడు జగదీష్ డిమాండ్ చేశారు. శనివారం ఆయన మాట్లాడుతూ కడప జిల్లాలో కొన్ని ప్రైవేటు,కార్పొరేట్ విద్య సంస్థల యాజమాన్యాలు ర్యాంకుల కోసం, అడ్మిషన్స్ పెంచుకొని, డబ్బులను దండుకోవడం కోసం సెలవుల్లో తరగతులు నిర్వహిస్తూ విద్యార్థులను మానసిక ఒత్తిడికి గురి చేస్తున్నారు. అలాంటి విద్యాసంస్థలపై చట్టపరంగా చర్యలు తీసుకొని, ప్రభుత్వ గుర్తింపును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. తల్లిదండ్రులు కూడా కార్పొరేట్ వ్యవస్థ సృష్టిస్తున్న గందరగోళం నుంచి పిల్లల్ని రక్షించుకోవాలని కోరారు.

లోక్ అదాలత్‌లో 2,346 కేసులు పరిష్కారం

కమలాపురం : కోర్టు కేసుల పరిష్కారంలో రాజీ మార్గం.. రాజ మార్గం అని, లోక్ అదాలత్‌లో పైసా ఖర్చు లేకుండా కేసులు సత్వరం పరిష్కరించుకోవచ్చని కమలాపురం జూనియర్ సివిల్ కోర్టు మెజిస్ట్రేట్ మధుసూదన్‌రావు తెలిపారు. శనివారం స్థానిక కోర్టులో లోక్ అదాలత్ నిర్వహించారు. ఇందులో భాగంగా గతంలో ఎన్నడూలేని విధంగా ఇరువర్గాలు రాజీ ధోరణిలో ఉన్న 2346 కేసులు పరిష్కరించినట్లు కోర్టు వర్గాలు తెలిపాయి. ఇందులో 2333 క్రిమినల్, 9 సివిల్, 4 బ్యాంక్ కేసులు పరిష్కారం అయినట్లు వారు తెలిపారు. అనంతరం వారిని ఉద్దేశించి మెజిస్ట్రేట్ మాట్లాడుతూ లోక్ అదాలత్‌లో పైసా ఖర్చు లేకుండా కేసులను సత్వరం పరిష్కరించు కోవచ్చన్నారు. రాజీ ధోరణిలో ఉన్న కేసులను లోక్ అదాలత్‌లో పరిష్కరించుకుంటే తర్వాత అప్పీలు చేసుకునే అవకాశం కూడా ఉండదన్నారు. కక్షిదారులు కక్ష్యలు, కార్పణ్యాలకు వెళ్లకుండా గ్రామ పెద్దల ఎదుట తమ సమస్యలను పరిష్కరించుకోవచ్చన్నారు.

'రాత' మారుతోంది!

- ప్రభుత్వ పాఠశాలలో అందమైన చేతిరాత శిక్షణ
- ఉపయుక్తంగా ఉందంటున్న విద్యార్థులు

ప్రస్తుత పోటీ ప్రపంచంలో అందమైన చేతిరాతకు ఉన్న ప్రాధాన్యత దృష్ట్యా ప్రభుత్వ పాఠశాలలు సైతం క్యాలీగ్రఫీపై దృష్టిసారిస్తున్నాయి. ఇందులో భాగంగా కడప నగరం సాయిపేటలోని 8వ వార్డు ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల చేతిరాతను మార్చేలా నిర్వహిస్తున్న క్యాలీగ్రఫీ ప్రత్యేక శిక్షణ శిబిరానికి విద్యార్థుల నుంచి విశేష స్పందన లభిస్తోంది. విద్యార్థుల నుంచి చక్కటి స్పందన లభిస్తుండటంతో ఇతర ప్రభుత్వ పాఠశాలలు సైతం క్యాలీగ్రఫీ బాటను పడుతున్నాయి.



కడపలోని సాయిపేట 8వ వార్డు ప్రాథమిక ఆదర్శ పాఠశాల

కడప ఎడ్యుకేషన్ : అందమైన అక్షరాలు రాయడం కొందరికే సాధ్యమన్న భావనను తొలగించేలా ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు కృషిచేస్తూ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు క్యాలీగ్రఫీపై ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. వివరాల్లోకి వెళితే.. కడప నగరం సాయిపేటలోని 8వ వార్డు నగరపాలక ప్రాథమిక ఆదర్శ పాఠశాలలో క్యాలీగ్రఫీ (హ్యాండ్‌రైటింగ్) శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు దాదీ నాగరాజు ప్రత్యేక చొరవ తీసుకుని హ్యాండ్‌రైటింగ్ నిపుణులు, ఉపాధ్యాయుల సహకారంతో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. ఈనెల 1వ తేదీ ప్రారంభమైన ఈ శిక్షణ శిబిరాన్ని కడప మండల విద్యాశాఖాధికారులు ఎస్. రఫీక్ అహ్మద్, ఎస్. ఇర్షాద్ అహ్మద్ ప్రారంభించగా క్యాంపు విజయవంతంగా కొనసాగుతోంది.

కార్పొరేట్ విద్యాసంస్థలకు ధీటుగా..

ఆకట్టుకునేలా రాయడం కొందరికే వరం అన్ననుడిని తుడిచేసేలా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు అన్నింటా రాణించగలరని చూపించేలా పాఠశాల ఉపాధ్యాయులు చేపట్టిన కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతోంది. చక్కటి చేతిరాత ద్వారా మంచి మార్కులు పొందే అవకాశం ఉందని నిపుణులు సూచిస్తుండటంతో విద్యార్థులు సైతం ఎంతో ఉత్సాహంగా సాధన చేస్తున్నారు. 1వ తరగతి విద్యార్థులు మొదలు 5వ తరగతి విద్యార్థుల వరకు అందరూ క్యాలీగ్రఫీ నేర్చుకుంటుండటం విశేషం. విద్యార్థులు క్యాలీగ్రఫీలో రాణిచేందుకు పెన్ను లేదా పెన్సిల్ గ్రిప్, పట్టుకునే విధానం, నోటు పుస్తకం ఉంచుకునే విధానంతో పాటు స్ట్రోక్స్ ఎలా ఇవ్వాలన్న అంశాలపై అవగాహన కల్పిస్తున్నారు. కొద్దిరోజుల్లోనే విద్యార్థుల హ్యాండ్‌రైటింగ్‌లో గణనీయమైన మార్పు కనిపిస్తుండటంతో విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

క్యాలీగ్రఫీ మంచి కార్యక్రమం

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల చేతిరాతను మెరుగుపరిచేసేందుకు చేపట్టిన శిక్షణ కార్యక్రమం అభినందనీయం. విద్యార్థిదశలో చేతిరాత అందంగా ఉంటే వారి భవిష్యత్తు బాగుంటుంది. మార్కులు సాధించడంలో మంచి చేతిరాత ఎంతో ఉపకరిస్తుంది. నేర్చుకున్న విద్యార్థులు క్రమం తప్పకుండా సాధన చేయడం ద్వారా వారి చేతిరాతను అద్భుతంగా తీర్చిదిద్దుకోవచ్చు. ఇలాంటి కార్యక్రమం ప్రభుత్వ పాఠశాలలపై తల్లిదండ్రుల నమ్మకాన్ని మరింత పెంచుతుంది.

– ఎస్. రఫీక్‌అహ్మద్, ఎంఈఓ–1, ఇర్షాద్ అహ్మద్, ఎంఈఓ–2, కడప